పెళ్ళికానుక

యన్. శ్రీకృష్ణారావు

"ఇవాళ తారీకు ఎంతో తెలుసా?" అంటూ ఆఫీసు ఫైల్సు చేతి కందించింది కమల.

"జీతం రావటానికి ఇంకా పదమూడు రోజులుంది" అన్నాడు కమల భర్త మధుసూదనరావు.

"నే నందుకు చెప్పలేదండీ! మీ స్నేహితుడు చంద్రశేఖరంగారి పెళ్లి ఇక పట్టుమని పదిరోజులైనా లేదే అని జ్ఞాపకంచేస్తున్నా."

"అవును-దానికి ఇప్పుడు నన్నేం చెయ్యమంటావు?"

"ఇది మరీ బావుంది! ఏం చెయ్యాలో మీకు నేను చెప్పాలా? ఆయన కల్యాణానికి మనం కూడా ఏదైనా కానుక ఇవ్వవద్దా? పెండ్లి పందిరిలో ఉత్త చేతులతో నిల్చుండా మనంకూడా ఏదైనా తీసుకెళ్తేనే కదా గౌరవంగా వుంటుంది? ఆయన మన పెళ్ళికి ఏం ఇచ్చారో మర్చిపోయారా?..." అని చెప్పుకుంటూ పోతోంది కమల...

"సరి సరి!...ఆ సంగతంతా నాకు తెలుసు. నీ వ్యాఖ్యానాలేమి అక్కర్లేదు" అంటూ విసుగ్గా కోపంగా వెళ్ళిపోయాడు మధుసూదనరావు.

ఆఫీసుకు వెళ్ళాడన్నమాటేగాని అక్కడ ఏ పనీ చేయలేకపోయాడు. ఆఫీసుకువచ్చే ముందు కమల చెప్పినమాటలే ఆఫీసులో వున్నంతసేపూ జ్ఞాపకానికి వచ్చాయి.

"చంద్రంతో స్నేహం ఇవాల్టిది, నిన్నటిది కాదు. ఫస్టుఫారంనుంచి బియ్యేవరకూ కలసి చదువుకొన్నాం. మేము ఇంటర్ చదువుతూండగానే చంద్రానికి పెళ్లిచేయాలని వాళ్ల తల్లిదండ్రులు ప్రయత్నించారు. కాని తను ఒప్పుకోలేదు. నేను కూడా ఉద్యోగంలో చేరేవరకూ పెళ్ళి చేసుకోకూడదనుకొన్నాను. కాని విధి బలీయమవటంవల్ల మేము బియ్యే ఫైనలీయర్ చదువుతూండగా కమలతో నాకు వివాహం జరిగింది. కల్యాణ సమయంలో చంద్రం నాకిచ్చిన ప్రెజెంట్ను గురించి తల్చుకొన్నప్పుడల్లా, నాకెంతో సంతోషంగా వుంటుంది. నామీద అతనికి ఎంత అవ్యాజ ప్రేమవుందో వర్ణించలేను. అతనిచ్చిన ప్రెజంటులోనే వుంది, అతని దూరదృష్టి—బుద్ధికౌశలమూ—అందరి మాదిరిగా తను వెండి బంగారు వస్తువులేమీ ఇవ్వలేదు. నా పేరుతో తీసుకొన్న ఐదువందల రూపాయల నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్లు నా కల్యాణ సమయంలో నాకు కానుకగా ఇచ్చిన చంద్రాన్ని చూసి పెండ్లి పందిరిలో వున్న వారంతా ఆశ్చర్యపోయారు! నాకు చెప్పలేని ఆనందం కలిగింది. నాలో నేనే తన్మయత్వం చెందాను. కృతజ్ఞత ఎట్లా చెప్పాలో కూడా నా కర్థం కాలేదు.

ఆ మర్నాడు—

"చంద్రం! నువ్వు చేసిన అపూర్వమైన ఉపకారానికి నేను నీకు ఏ విధంగా కృతజ్ఞత చెప్పాలో తెలియటంలేదు. శీఘ్ర కాలంలోనే నీకూ వివాహమయి నేనుకూడా నీలాగే ఓ ప్రత్యేకమైన కానుకను ఇస్తేనే కాని నా మనస్సుకు శాంతివుండదు. అం

★ పెళ్ళికానుక ★

దుకు నాకా అవకాశాన్ని కల్గించమని భగవంతుణ్ణి ప్రార్థిస్తాను" అన్నాను.

"పోరా! చవటా! కానుకట—కానుక! నా కల్యాణానికి నువ్వు సతీ సమేతంగా వచ్చి, నా దగ్గర కూర్చుంటే అదే నాకు నువ్వు ఇచ్చే ఉత్తమోత్తమమైన కానుక. పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనస్సు పాడు చేసుకోకు!" అని నన్ను హెచ్చరించాడు నా ప్రాణ స్నేహితుడైన చంద్రశేఖరం అనాడు.

ఇదంతా జరిగి మూడేళ్ళయింది.

చంద్రం సెక్రటరియేట్‌లో యిప్పుడు అసిస్టెంటు సెక్రటరిగా ఉన్నాడు. నిజం చెప్పాలంటే నాకు ఈ వుద్యోగం కూడా అతని దయవల్లనే దొరికింది. అదృష్టం కొద్దీ అతను గజిటెడ్ ఆఫీసరయాడు. నా దురదృష్టంకొద్దీ నేను గుమాస్తా అయాను!

ఇన్ని సంవత్సరాల తర్వాత చంద్రం వివాహం చేసుకోనేందుకు ఒప్పుకున్నందుకు నేను చాలా సంతోషించాను. కాని వెంటనే, అదొక విధమైన కలవరం నాలో ప్రవేశించింది.

చంద్రం వివాహానికి నేను ఏమి ఇవ్వగలను? నా వివాహానికి అతను ఇచ్చినది అందరికీ తెలును. అందుకు బదులు నేనుకూడా ఏదైనా ఇవ్వకపోతే, మా క్లాస్‌మేట్స్ అంతా నన్ను హేళనచేస్తారే! భగవంతుడా! నాకీపరిస్థితి ఎందుకుతెచ్చి పెట్టావు అని దుఃఖించాను!

చంద్రం వివాహం కిందటినెలలో జరిగి వుండినా బాగుండేది. కిందటి నెలలోనే చెల్లి పెళ్లికోసం చంద్రం ఇచ్చిన సర్టిఫికేట్లన్నీ మార్చివేశానే! ఇప్పుడు చంద్రం పెళ్ళికి పది రూపాయలు కూడా ఇవ్వలేని స్థితిలో వున్నానే! పది మందిలోనూ ఏంచెప్పను? పోనీ వెళ్ళటం మానేద్దామంటే ఉన్న ఊళ్ళో జరిగే పెళ్ళికి వెళ్ళకుండా ఎల్లా కుదురుతుంది. ఉన్న ఊరు కాకపోతే మాత్రం—చంద్రం వదిలేస్తాడా? ఎవళ్ళనో పంపిస్తాడు కూడాను, నన్ను లాక్కురమ్మంటూ...!

మనస్సు పరిపరి విధాలపోయింది. సాయింత్రం అయిదుగంటలయింది. బరువుగా కాళ్లు ఈడ్చుకుంటూ - ఆలోచిస్తూ ఇంటికొస్తున్నాను. దారిలో మా మిత్రబృందం నన్ను ఆపింది.

"ఏం మధూ! నీప్రాణ స్నేహితుడిపెళ్ళికి ఏమిటి నీకానుక?" అన్నాడు రామం.

వెంటనే ఏం సమాధానం చెప్పను? ఏమని చెప్పను?

"అంతా, పెళ్ళిరోజుదాకా రహస్యంగా వుంచాలనుకొంటున్నావా? ఆ కొంచెం మాకు తెలిసిపోతే నీలాటిదే మేము కూడా తెచ్చి నీ ప్రెజెంటుకు విలువలేకుండా చేస్తామనుకొంటున్నావా?" అన్నాడు జగన్నాథం.

"అదేంకాదురా! ప్రస్తుతం నేను కొంచెం చిక్కుల్లోవున్నాను. చంద్రం మీద నాకున్న ప్రేమకు సానుభూతిగా నాలుగు అక్షతలు వాళ్ళిదరిమీదా వేస్తాను. అదే నా కానుక" అన్నాను.

ఈ మాటలు విని వాళ్ళంతా విరగబడి నవ్వారు—"ప్రేమట! ప్రేమ! పాట్లకాయంకాదూ? ఈయనగారికి ఒక్కరికే కాబోలు ప్రేమ! మిగిలినవాళ్ళంతా విరోధులు—అంతేనా...యీ మాదిరి వేదాంతం మాట్లాడి ఊరందర్నీ మోసం చేయకు తమ్ముడూ" అంటూ నా భుజం తట్టాడు రామం.

"ఒరేయ్ రామం! మన మధు చూడానికి చాలా అమాయకుడిలా వున్నాడని మోసపోకు! బలేయమోడన్! లేకపోతే నీలాగ నాలాగ వుంటాడనుకొన్నావా? తన సామర్థ్యంచూడు—తన వివాహానికి చంద్రం ఇచ్చిన వెయ్యి రూపాయలు మూటకట్టుకొన్నాడు. ఇప్పుడు చంద్రం పెళ్ళికి తను నాలుగు అక్షతలు వేసి తన పని పూర్తిచేసుకొనేందుకు చూస్తున్నాడు! ఒరేయ్! మధూ! నువ్వు బాగుపడతావురా!" అంటూ హేళనగా నవ్వుతూ నా వీపు తట్టాడు మూర్తి.

ఇంకా ఏమేమో అన్నారు. వినగలిగే స్థితిలో నేను లేను. మే మందరం క్లాసు మేట్సు. ఒకే ఆఫీసులో కాకపోయినా, ఒకే వూళ్ళోనే ఉద్యోగాలు చేస్తున్నాం. వాళ్ళు అంతా ఎవరికి క్కి తగినట్లు వాళ్ళు తలోక వస్తువూ ఏర్పరచుకొన్నారు.

అవాళ్టికి మా సంభాషణ ముగిసింది. ఎవరి ఇళ్ళకు వాళ్ళం వెళ్ళిపోయాము.

ఊరంతా బొంగరంలాతిరిగాను. అప్పు చేసి అయినాసరే కల్యాణమండపంలో నా గౌరవాన్ని కాపాడుకోవాలను కొన్నాను. తెల్లవారితే చంద్రం పెళ్లి!

ఆరోజుదాకా ఒక పెద్దమనిషి రెండు వందలు రూపాయలు అప్పు ఇవ్వటానికి అంగీకరించి ఆకస్మాత్తుగా—సర్దుబాటు కాలేదని మోసం చేశాడు! నాకు గట్టిగా ఏడవాలనిపించింది—కల్యాణానికి వెళ్ళటానికి కట్టుకోటానికి మంచిచీర లేదని కమలగోడ... ఎవరితో చెప్పుకోను నా బాధ...!! చివరికి ఒక నిశ్చయానికొచ్చి కమలతో చెప్పాను.

"కమలా! నా దురదృష్టంకొద్దీ అప్పు కూడా పుట్టలేదు. మనం ఉత్తచేతులతో అక్కడకు వెళ్లటం ఏం బాగుండదు. జీతం రాగానే—ఈ నెలకి ఇంటి అద్దె, పాలు—కిరాణా కొట్టుబాకీలు అప్పు చేసి—ఏదైనా కొనితెస్తాను. మళ్ళీ నెలలో ఎల్లాగో సర్దుకొందాము—ఇద్దరం కలిసి అపుడు వెళ్దాం," అన్నాను.

కమలమాత్రం ఏం చేస్తుంది? 'సరే' నంది భారంగా.

వీధి తలుపు చప్పుడయింది. "కమలా! అప్పుడే ఎవళ్లనో పంపించాడు లాగుంది. చంద్రం! నేను ఇంట్లోలేనని చెప్పేసేయ్. లోపలికి రానివ్వకు" అంటూ నేను నా గదిలో దాక్కున్నాను.

కమల నేచెప్పినట్లు చెప్పి ఆ వచ్చిన మనిషిని పంపేసింది.

'హమ్మయ్య' అంటూ కూర్చున్నాను. ఇంతలోకే చంద్రంకారు హారన్ మా ఇంటి ముందు మ్రోగింది. నాకు మతిపోయింది! వచ్చిన వాళ్ళు సామాన్యులా? చండప్రచండులైన రామం, మూర్తివచ్చారు. తిన్నగా నా గదిలోకే వచ్చేశారు.

"మధూ! ఇంకా కూర్చునే వున్నావా? నువ్వు రాలేదని మమ్మల్ని తిడుతున్నాడు చంద్రం. ఊ...ఊ...బయలుదేరు. నువ్వు



ఆంధ్రసేఫ్ కంపెనీ,

సరస్వతీ టాకీస్ రోడ్డు : విజయవాడ-1.

★

మా వద్ద ఫైర్ ప్రూఫ్, నాన్‌ఫైర్ ప్రూఫ్ ఇనుప పెట్టెలు, ఉక్కు బీరువాలు, క్యాష్ బాక్సులు, మరియు ఆఫీసు ర్యాకులు సరసమైన ధరలకు లభించును. ఆర్డరుపై ప్రత్యేక పనులు తయారు చేయగలము. వివరములకు వ్రాయండి.

'NVKR-VJA'

రాకపోవటంవల్ల అక్కడ ప్రోగ్రామంతా ఆగిపోయింది. అంతా నీకోసం ఎదురు చూస్తున్నారు" అన్నాడు రామం.

"నాకు ఒంట్లో బాగుండలేదు రామం! క్షమించమని చెప్పు," అన్నాను.

"ఒరేయ్! నువ్వు దబాయించకు! జ్వరంగావున్నా సరే! సైకిల్ లో వేసి తీసుకు రమ్మన్నాడు-మేమంతా వాడికళ్ళకి మనుష్యుల్లా కనిపించటం లేదు—నువ్వు లేకుండా మేము అక్కడికి వెళ్తే వాడు మా వీపులు వాయించేస్తాడు!! నువ్వగనుక ఇంకా పెంకితనం చేశావంటే మేము నీవీపు వాయించేస్తాం...ఆలోచించుకో... మర్యాదగా కారెక్కు" అన్నాడు మూర్తి.

నాకు ముందే తెలుసు ఇటువంటిదేదో జరుగుతుందని—ఏంచెయ్యను? వాళ్ళతో బయలుదేరాను.

నేను చంద్రం దగ్గరకు వెళ్ళానో లేదో: "ఏరా ఫూల్! నన్నే మోసం చేద్దామను కొంటున్నావా?" అంటూ తనపక్కనే కూర్చో పెట్టుకొన్నాడు నన్ను చంద్రం. ఆ తర్వాత శాస్త్రప్రకారం జరగవలసిన వివాహకాండ అంతా జరిగింది. తర్వాత వధూవరులకు కానుకలు—

ఎవరికి తోచినది వారు చదివిస్తున్నారు. నేనో రాతిబొమ్మలా కూర్చున్నాను. ఎవళ్ళైనా నా ప్రజెంటుసంగతి అడిగితే నేను ఏం చెప్పను? మర్యాదగా అందరితోపాటు మొదట్లోనే పెళ్ళికి రాకపోవటంవల్ల—పదిమందిలోనూ నన్ను అవమానం చేయటానికి వేసిన ప్లానేమో ఇది. లేకపోతే, నన్ను బలవంతంగా ఎందుకు రప్పించాలి? ఇంక అక్కడ వుండలేక పోయాను. నేనులేచాను వెళ్ళిపోవటానికి...

"ఒరేయ్ మధూ! ఇంకా ఆశీర్వచనాలు కాలేదు కూర్చో" అంటూ మళ్ళీ కూర్చో పెట్టాడు నన్ను చంద్రం.

నాకు కళ్ళనీళ్ళు కూడా తిరిగాయి. ఎవ్వరూ చూడకుండా కళ్ళు ఒత్తుకున్నాను.

అందరూ బహుమతులివ్వటం పూర్తయింది. అప్పుడే లోపల్నుంచి యిద్దరు పనివాళ్లు ఒక పెట్టెతెచ్చి, అందులో వున్న దానిని బయటకు తీసి వధూవరుల ముందుంచారు.

"తన ప్రియమిత్రుడైన చంద్రశేఖరానికి వివాహ సందర్భంలో మధుసూదనరావు హృదయపూర్వకంగా సమర్పించే కానుక—రేడియోగ్రామ్"—అన్నాడు పురోహితుడు.

నా చెవులను నేనే నమ్మలేక పోయాను—నేనేమిటి?—రేడియోగ్రామ్ ఇవ్వట మేమిటి?

మా మిత్రబృందం అంతా నన్ను తెగ పొగిడారు. నేను ఎవళ్ళతోనూ ఏమీ మాట్లాడలేని స్థితిలో వున్నాను. నాకిదంతా అయోమయంగా వుంది. తర్వాత ఏకాంతంగా చంద్రాన్ని ఇలా అడిగాను:

"ఇదంతా ఏమిట్రా తమాషాగా వుంది?"

"తమాషా లేదు - గిమాషా లేదు - ముందు ఏదైనా తిందాం పద' అంటూ లాక్కుపోయాడు. ఆ తమాషా ఏమిటో చెప్పకుండానే నన్ను ఇంటికి పంపివేశాడు చంద్రం.

ఇంట్లో కాలుపెట్టే టప్పటికి నాకు మరో తమాషా ఎదురయింది.

తళతళ మెరిసిపోయే గులాబిరంగు సిల్కు చీర కట్టుకొని బాగుందా అంటూ ప్రత్యక్షమైంది కమల!!

మీ చంద్రశేఖరంగారు తన నౌకరుచేత పంపిచారు. మీకూవచ్చాయి బట్టలు - ఊ... మీరెల్లాగా వెళ్ళొచ్చారు కాబట్టి-కొంచెం ఇంట్లో వుండండి. నేనోసారి వాళ్ళింటికి వెళ్ళివస్తా అంటూ, బయలుదేరింది. మళ్లీ వెనక్కు తిరిగి బట్టలతోపాటు ఏదోఒక కవరు కూడ వచ్చింది. మీ బల్లమీద పెట్టాను చూడండి," అని వెళ్ళిపోయింది కమల: కవరు చించాను. దాన్ని చంద్రమే రాశాడు!

ప్రియమైన మధూ!

నువ్వు మహాబుద్ధిశాలివి! నీ మెదడును ఇన్సూర్ చెయ్యాల్సిందే! కేవలం ఒక కానుక ఇవ్వలేని కారణంగా, నీ ప్రాణస్నేహితుడి పెళ్లికిరాకుండా, ఇంట్లో వుండేద్దనిపించిన నువ్వు—బుద్ధికి బృహస్పతివి!!

నువ్వు ఎవరిదగ్గర అప్పు చేద్దామనుకొన్నావో వారి ద్వారానే విషయం అంతా తెలుసుకొన్నాను. నీకు అయన ఇస్తానన్న డబ్బు ఇవ్వకపోవటానికి కారణం కూడా నేనే. నాకోసం నువ్వు అప్పుల్లోపడి కొట్టుకోటం నేను చూసి సహించలేను. అందుకే డబ్బు ఇవ్వద్దని చెప్పాను.

మూడు సంవత్సరాలక్రితం నీతో నేనేం చెప్పానో జ్ఞాపకం తెచ్చుకో! నువ్వు నా పక్కన వచ్చి కూచుంటే — అంతకన్నా నాకింకేం కావాలి? నీ నిర్మలమైన మనస్సులోని మంచితనాన్ని అర్థంచేసుకోగలిగిన నాకు నువ్వు కానుక ఇవ్వాలా?

చదువులో శుద్ధ మొద్దునయిన నన్ను నీ అపార విజ్ఞానంతో, పట్టుదలతో నా చేత కష్టపడి చదివించి ఉత్తమ విద్యార్థిగాచేసి—అన్ని పరీక్షలలోనూ ఫస్టుక్లాసులో ప్యాసయేటట్లు చేసిన నువ్వు—ఒక విధంగా నాకు గురువువైన నువ్వు — కానుక ఇస్తే తీసుకొంటాననే అనుకొన్నావా?

నీ స్థితిగతులన్నీ నాకు బాగా తెలుసు—నా హృదయంలో నీకు శాశ్వతమైన స్థానం వున్నది. నేను శ్రీమంతుణ్ణనో లేక గెజెటెడ్ ఆఫీసర్ననో అని—నిన్ను మర్చిపోతానను కోకు. నేను ఎక్కడవున్నా నిన్ను మాత్రం మర్చిపోను. మనలో ఇమిడివున్న అవ్యాజ ప్రేమ శాశ్వతమైనది. దానిని ఎవర్లూ చెరుప లేరు.—

నీ ప్రస్తుత పరిస్థితివల్ల నా పెళ్ళికి రావని నాకు బాగా తెలుసు. అందుకనే నిన్ను బలవంతంగా రప్పించాను. నేనే ఒక రేడియోగ్రామ్‌కొని నీ పేర చదివించాను. పదిమందిలోనూ నువ్వు చిన్నబుచ్చుకోకుండా వుండాలనే ఈ పని చేశాను. అంతకంటే మరో కారణం లేదు. ఈ రహస్యం నీ మనస్సులోనే వుంచుకో!

డబ్బున్నవాడిని నేనుండగా నువ్వు డబ్బు కోసం ఇబ్బంది పడి అప్పులపాలవటంలో అర్థంలేదు. ఇప్పుడు నీకు సుమారు అయిదు వందలుదాకా అప్పులున్నాయని తెలిసింది. ఈ అప్పుల బాధతో నువ్వు వెంగపెట్టుకొంటూ ఆరోగ్యాన్నికూడా పాడుచేసుకొంటున్నావు. ఇటువంటి పిచ్చి పిచ్చి పనులు ఇక మానెయ్యి. సాయంత్రం మా చెల్లికిచ్చి ఆరువందలు పంపుతాను. వెంటనే అప్పులన్నీ తీర్చెయ్యి.

మరొక విషయం! ఈ సమయంలోనే చెప్పదలచుకొన్నాను. త్వరలోనే నువ్వు కూడా ఒక ఆఫీసరు పదవి నలంకరించబోతున్నావు. నేనే రికమెండ్ చేసి పంపాను. బహుశా ఈ నెలాఖరులోగానే ఆర్డర్లు వచ్చేస్తాయి" ఆర్డరు నీ చేతికి వచ్చేవరకు ఎవరికీ చెప్పకు.

త్వరలోనే నువ్వు తండ్రి అవబోతున్నావని విని చాలా సంతోషించాను. నీకు పుత్రోదయ మయ్యేటాటికి నీ రోజులు పూర్తిగా మారిపోతాయని ఆశిస్తున్నా...ఇక నించేనా సంతోషంగా కాలాన్ని గడుపు.

కమలకీ, నీకూ బట్టలు పంపాను. అవికట్టుకొని ఇద్దరూ కలసి భోజనానికి రండి. నీ,—

"చంద్రం"

ఆనందంతో మధుకళ్లనుండి జలజలా కన్నీళ్ళురాలాయి! ★

RATNAM'S 'N' OIL
సేవించిన పూర్తి సంతోష సౌఖ్యము అనుభవించగలరు. 1 సీసా రూ. 11-4-0.
ఎడ్రెస్సుతో జాబు వ్రాయండి.
డాక్టర్. రత్నం సన్స్,
మలకపేట బిల్డింగ్స్, హైద్రాబాదు - 2.